క్లుప్తంగా

ఆత్మీయ కలయిక



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన దెందులూరు జెడ్పీటీసీ కుటుంబం

దెందులూరు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు కుటుంబం తాడేపల్లిలో శనివారం కలిశారు. నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను వివరించినట్టు జెడ్పీటీసీ తెలిపారు. పార్టీ అభివృద్ధికి అందరూ సమన్వయంతో పని చేయాలని మాజీ సీఎం జగన్ సూచించారని జెడ్పీటీసీ అన్నారు. మాజీ సీఎంను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు నిట్టా గాంధీ, గంగాధరరావు, పెరిసిరత్నం, గంగరాజు, రామకృష్ణ ఉన్నారు.

92.87 శాతం పెన్షన్ల పంపిణీ

ఉంగుటూరు: మండలంలో శనివారం పెన్షన్లు 92.87శాతం పంపిణీ పూర్తి చేశా మని ఎంపీడీవో రాజ్‌మనోజ్ వెల్లడించారు. మండలంలో 11,446 మందికి పెన్షన్లు పంపిణీ చేయాల్సి ఉండగా 10,630 మందికి పెన్షను పంపిణీ పూర్తి చేశామని తెలిపారు. నీలాద్రిపురంలో అత్యధికంగా 98.96 శాతం పంపిణీ పూర్తి చేయగా, అత్యల్పంగా బొమ్మిడిలో 88.61 శాతం పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

హెచ్ఐవీ అంటువ్యాధి కాదు



నారాయణపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ డాక్టర్ టీకే విశ్వేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కల్పించవలసిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి జి.హెప్సిబా మాట్లాడుతూ యువత ఎయిడ్స్ వ్యాధికి గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వెంకన్నబాబు మాట్లాడుతూ హెచ్ఐవీ అనేది అంటువ్యాధి కాదు అంటించుకునే వ్యాధి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ జి.నిర్మల కుమారి, అకడమిక్ కోఆర్డినేటర్ డా. కొండా రవి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డి.రెడ్డయ్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన ముగ్గుల పోటీలు పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల నుంచి నారాయణపురం వెళ్లే దారిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

గణపవరం: ఎయిడ్ మహమ్మారిని సమూలంగా నిర్మూలించి, ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ఇన్‌చార్జి ప్రిన్సిపల్ పి.మధురాజు, పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. శనివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ 1,2 యూనిట్లు, రెడ్‌రిబ్బన్ క్లబ్, ఎకో క్లబ్, పీహెచ్‌సీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ వర్క్, ఆధ్వర్యంలో ఎయిడ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ నుంచి విద్యార్థులు, అధ్యాపకులు ప్రదర్శనగా నినాదాలు చేస్తూ గణపవరం పీహెచ్‌సీ వద్దకు చేరి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మధురాజు, పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ మాట్లాడుతూ హెచ్ఐవీ నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని, అన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారులు జి.వెంకటరమణ, భాస్కరరావు, అధ్యాపకులు టి.అక్కిరాజు, స్వరూపరాణి పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలి

ఏలూరు (టూటౌన్): ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు, అదాని విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, జిల్లా కో కన్వీనర్ ఆగొల్లు వెంకట కృష్ణారావులు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత రెండు నెలల నుంచి ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపిందని పేర్కొన్నారు. గతంలో రూ.6072 కోట్లు, తరువాత రూ.11 వేల కోట్లు, ఇప్పుడు మరో రూ.9,412 కోట్లు భారాన్ని మోపిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ సన్నిహితుడు గౌతం అదాని దేశంలోని విద్యుత్తు సంస్థలను రూ.లక్ష కోట్ల విద్యుత్ ప్రాజెక్టును రూ.2000 కోట్లు అమెరికా కంపెనీలకు ఎర వేసి సంపాదించారని విమర్శించారు. తక్షణం పెంచిన విద్యుత్ భారాలను రద్దు చేయాలని ఆదిశేషు, వెంకట కృష్ణారావులు డిమాండ్ చేశారు.

అంతర పంటలతో ఆదాయం భళా

- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం
- స్వల్ప కాలంలోనే పంట చేతికి
- అన్నదాతలకు ఆర్థిక భరోసా



గార్లమడుగులో అరటిలో అంతర పంటగా నిమ్మ సాగు



కొబ్బరిలో అంతర పంట సాగుచేస్తున్న జామ



వంగూరులో కొబ్బరిలో అంతర పంటగా కోకో

పెదవేగి: వాణిజ్య పంటల్లో అంతర పంటలుగా వివిధ రకాల కూరగాయలు, పూలసాగు చేపట్టి పెదవేగి మండల రైతులు అధిక లాభాలను ఆర్జిస్తున్నారు. వాణిజ్య పంటలకు దీర్ఘకాలంగా పెట్టుబడులు పెట్టాల్సి ఉండటంతో రైతులు అదనపు ఆదాయ వనరుగా అంతర పంటలను సాగు చేస్తున్నారు. వాణిజ్య పంటల రైతులు మార్కెట్‌లో ఫలసాయం అందే సమయంలో ప్రకృతి వైపరీత్యాలతో పంటలను కోల్పోవటం, లేకపోతే గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఈ అంతర పంటలు ఆర్థికంగా ఆదుకుంటున్నాయి. ఈ పంటల సాగుతో ప్రధాన పంటకు పెట్టుబడి కోసం అప్పుల కోసం వెళ్లాల్సిన పని లేకుండా అంతర పంటలు ఆదాయాన్నిస్తున్నాయి.

నియోజకవర్గంలో 3,750 ఎకరాల్లో అంతర పంటలు

దెందులూరు నియోజకవర్గం పరిధిలో సుమారు 3,750 ఎకరాల్లో అంతర పంటలు సాగవుతున్నాయి. వీటిలో అధికంగా పెదవేగి, కొండలరావుపాలెం, బాపిరాజుగూడెం, విజయరాయి, జగన్నాథపురం, రామశింగవరం, కూచింపూడి, వేగివాడ, టి గోకవరం, చల్లచింతలపూడి, మేదినరావుపాలెం, రామారావుగూడెం పంగిగూడెం, కొక్కిరిపాడు, వేంపాడు గ్రామాల్లో సుమారు 3,250 ఎకరాల్లో అంతర పంటలు సాగు చేస్తున్నారు.

ఎన్నో లాభాలు

వాణిజ్య పంటలకు ఏడాది పొడవునా పెట్టుబడి పెట్టాల్సి ఉండగా ఈ పంటల ద్వారా లభించే ఆదాయాన్ని వినియోగించడంతో ఆర్థిక భారం తగ్గుతుందని చెబుతున్నారు. అంతేకాకుండా చేలల్లో కలుపు అంతంత మాత్రంగానే రావడం, ఈ అంతర పంటలకు పెట్టుబడి తక్కువ అవడం, ఎక్కువ లాభాలు రావడంతో వీటిని సాగుచేయడానికి రైతు మొగ్గు చూపుతున్నారు. ఎరువులు, పురుగు మందుల ధరలు చుక్కలనంటడంతో ఒక పంటను సాగుచేసి లాభాలు ఆర్జించే రోజులు కనుమరుగయ్యాయని రైతులు చెబుతున్నారు. వేసిన పంట బాగా ఉన్నా అధిక దిగుబడులు వచ్చినా ఆ సమయంలో మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించకపోతే నష్టపోవాల్సి వస్తోందని తెలిపారు. అందుకే ఈ అంతర పంటలు వేయడం వల్ల కేవలం 45 రోజుల్లో ఫలసాయం పొంది లాభాలు ఆర్జించవచ్చని చెబుతున్నారు. వాణిజ్య పంటలకు పెట్టుబడి పెరగడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఈ పంటలు ఆదుకుంటున్నాయని రైతులు చెబుతున్నారు. కూరగాయల పంటలు సాగుచేయడం వల్ల నిత్య ఆదాయం లభిస్తోందని రైతులు చెబుతున్నారు.

తెగుళ్లనూ తరిమేయొచ్చు

అంతర పంటలతో భూములకు, రైతులకు ఎంతో మేలని వ్యవసాయాధికారి ఎం ప్రియాంక తెలిపారు. ఈ పంటల వల్ల పంటల్లో వచ్చే తెగుళ్ల వ్యాప్తి తక్కువగా ఉంటుందన్నారు. ఇందుకు కారణం పూలసాగుతో అక్కడకు వచ్చే మేలు చేసే మిత్ర పురుగులు క్రిమికీటకాలను ఆహారంగా తీసుకుంటాయని చెప్పారు. దీనివల్ల తెగుళ్లు ఆశించవని వెల్లడించారు. చేలల్లో కలుపు నివారణ అవుతుందని, పెట్టుబడి తక్కువగా ఉంటుందని, నీటి సమస్య ఉండదని, నిత్య ఆదాయం పొందవచ్చని వివరించారు. పంట మార్పిడి వల్ల భూమికి ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఈ పంటల నుంచి వచ్చే పచ్చిరొట్టతో భూసారం పెరుగుతుందన్నారు.

అంతర పంటలుగా ఎన్నో రకాలు

వాణిజ్య పంటలైన అరటి, కంద, కొబ్బరి, పసుపు, జామ, వంటి పంటల్లో బెండ, మిరప, ఆకుకూరలు, వంగ వంటి పంటలతో పాటు పూల సాగును అంతర పంటలుగా వేస్తున్నారు. వాణిజ్య పంటలు వేసిన నాటి నుంచి ఫలసాయం అందడానికి 9 నెలల నుంచి 11 నెలల సమయం పట్టడంతో రైతులు అప్పటి వరకు ఏదోవిధంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఈ ఏడాది అరటి, కంద పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొబ్బరికి గిట్టుబాటు ధర ఉన్నా దిగుబడి లేకపోవడం వల్ల ఆదాయం అంతంత మాత్రంగానే వచ్చింది. దీనితో ఈ తోటల్లో పసుపు, అరటి, కోకో, కంది, కూరగాయలు పంట వేస్తున్నారు.

ఆదాయం వస్తోంది



పొలం కౌలుకు తీసుకుని కొబ్బరి తోటలో కోకోతోపాటు ఆనపకాయ, బీర పాదులు వేశాను. తోటలో పందిరి ఏర్పాటు చేయడంతో పాదులు బాగా పెరుగుతున్నాయి. కొంత భాగంలో అంతర పంటగా బంతి మొక్కలు నాటాను. అంతర పంటల సాగుకు పెట్టుబడి తక్కువ అవ్వడంతో పాటు అదనపు ఆదాయం వచ్చి ఆదుకుంటున్నాయి.

– పంజగల నరసింహరావు, కౌలు రైతు, కొండలరావుపాలెం

లాభాలు ఆర్జిస్తున్నాను



వాణిజ్య పంటలో ఏదో ఒకటి అంతర పంట వేస్తాను. కొబ్బరిలో కోకో, ఆయిల్ పామ్ తోటలో కోకో సాగు చేసి లాభాలు పొందుతున్నాను. పొలంలో ఖాళీ ప్రదేశాల్లో కూరగాయలు లేదా ఆకుకూరలు ఇలా ఏదో పంటను అంతర పంటగా వేయడం మొదలు పెట్టాను. అంతర పంటల ఉత్పత్తులతో ఆదాయం నిరంతరం వస్తోంది. దీంతో పెట్టుబడికి ఇబ్బంది ఉండటం లేదు.

– పులగం వేణుగోపాలరెడ్డి, రైతు, విజయరాయి

రైతులు ఆందోళన చెందవద్దు



భీమడోలులో అధికారులకు పలు సూచనలందిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి



కైకరంలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న ఆర్డీవో

భీమడోలు: జిల్లాలో తుఫాన్ ప్రభావం పెద్దగా లేదని, రైతులు అధైర్యపడొద్దని ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి అన్నారు. అల్ప పీడన ప్రభావంతో వర్షం కురుస్తున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం భీమడోలులోని జాతీయ రహదారి, ఉన్నత పాఠశాల రోడ్డు ప్రాంతాల్లో టార్పాలిన్లు కప్పి ఉంచిన ధాన్యాన్ని ఆమె పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏవో ఎస్‌పీపీ ఉషారాణికి పలు సూచనలు చేసారు. రైతులు ధాన్యం తడిసిపోకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ అల్ప పీడన ప్రభావంతో చిరుజల్లులు తప్ప భారీ వర్షాలు పడబోవన్నారు. రైతులు ఆందోళన చెందవద్దన్నారు. రైతులు ఒకటి, రెండు రోజుల పాటు కొత్తగా వరి కోతలు చేపట్టవద్దన్నారు. వర్షంలో కోతలు కోస్తే పచ్చి ధాన్యంలో తేమశాతం పెరిగి రైతులు ఇబ్బందులు పడతారన్నారు. రైస్ మిల్లర్లు ఒకటి, రెండు తేమ శాతాలు తేడా ఉన్నా రైస్‌మిల్లులు తీసుకుంటున్నారన్నారు. ఇప్పటికే వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారన్నారు. రైతులు ఇబ్బందులుంటే కంట్రోల్ రూములకు ఫోన్ చేయాలని కోరారు. టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని, రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌డీటీ భరత్, వీఆర్వోలు వినయ్, ప్రతాప్, వీఏఏ రూప సిబ్బంది పాల్గొన్నారు.

కైకరంలో ఆర్డీవో పర్యటన

ఉంగుటూరు: ధాన్యం త్వరితగతిన ఎగుమతి చేసి, మిల్లులకు తరలించాలని ఆర్డీవో అంబరీష్ రైతులకు సూచించారు. శనివారం ఉంగుటూరు మండలం కైకరంలో ఆరుబయట కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం రాశులను ఆయన పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దారు పూర్ణచంద్రప్రసాదు, వీఆర్వోలు ఉన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

దెందులూరు: తుఫాన్ కారణంగా చేతికొచ్చిన పంటను భద్రపరచుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. శనివారం దెందులూరు, సీతంపేట, కొత్తగూడెంలోని కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ తుఫాన్ తీవ్రత ఎక్కువగా ఉండటంతో రైతులను కోతలు కోయవద్దని సూచించారు. ప్రస్తుతం ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని తహసీల్దార్ బి.సుమతిని ఆదేశించారు. ధాన్యాన్ని కల్లాల్లో, రోడ్లపై ఆరపెట్టిన రైతులతో మాట్లాడి వెంటనే ధాన్యం తడవకుండా మిల్లులకు పంపించాలని వారికి చెప్పారు. ఆమె వెంట రెవె న్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, వీఆర్వోలు ఉన్నారు.

దురలవాట్లకు బానిసలు కావొద్దు



భీమడోలులో మాట్లాడుతున్న భీమడోలు ఎక్సైజ్ సీఐ బి.సత్యనారాయణ

భీమడోలు: దురలవాట్లకు బానిసలై యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని భీమడోలు ఎక్సైజ్ సీఐ బి.సత్యనారాయణ కోరారు. భీమడోలులోని మాంటిస్సోరి విద్యాసంస్థల కార్యాలయంలో శనివారం భీమడోలు ఎక్సైజ్ ఆధ్వర్యంలో యువతీ యువకులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డిగ్రీ కళాశాల కరస్పాండెంటెంట్ కె.ప్రేమ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎక్సైజ్ సీఐ బి.సత్యనారాయణ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా యువత తమ లక్ష్యాల సాధనకు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని కోరారు. మత్తు పదార్థాలు వినియోగించే వారిపై నమోదయ్యే కేసులు, శిక్షలను వివరించారు. ఈ తరహా కేసుల వల్ల జీవితం పాడైవుతుందన్నారు. తమ గ్రామాల్లో మత్తు పదార్థాల సమాచారం తెలిస్తే తమ దృష్టికి తీసుకుని రావాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎస్.శివధర్, ప్రిన్సిపల్స్ పి.బాలు, కేసరి, అధ్యాపకురాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన శేషు



ఎంఈవో శేషును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గణపవరం: మూడున్నర దశాబ్దాలుగా ఉపాధ్యాయునిగా, మండల విద్యాశాఖ అధికారిగా సమర్థవంతమైన సేవలు అందించి అందరి అభిమానాన్ని పొందిన గణపవరం ఎంఈవో పుచ్చల శేషు నేటి ఉపాధ్యాయులకు ఆదర్శమని గణపవరం ఎంఈవో–2 గొర్రెల బాలయ్య అన్నారు. శనివారం గణపవరం, నిడమర్రు మండలాల ఎంఈవో–1గా పనిచేసి పదవీవిరమణ పొందిన పుచ్చల శేషును మండలంలోని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన ఉపాధ్యాయ వృతిని అంకితభావం, చిత్తశుద్ధితో నిర్వహించాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి కోట్ల రూపాయలు కేటాయిస్తున్నాయని అన్నారు. ఉపాధ్యాయునిగా, ఎంఈవోగా ఎంతో సమర్థవంతంగా పనిచేసి ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారుల మన్ననలు పొందిన పుచ్చల శేషును ఆదర్శంగా తీసుకుని, ఉపాధ్యాయ వృత్తిలో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శేషును పూలమాలలతో, దుశ్శాలువలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

తేమశాతం నిబంధనలు సడలించాలి



పోలసానిపల్లిలో రహదారిపై ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్

భీమడోలు: ఫెంగల్ తుఫాన్ వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తేమ శాతం నిబంధనను సడలించి కల్లాల్లోని ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుని అన్నదాతలను ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. భీమడోలు, పోలసానిపల్లి గ్రామాల్లోని రహదారులపై ఆరబోసిన ధాన్యాన్ని శనివారం వారు పరిశీలించారు. రైతులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా ఆచరణలో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయని పేర్కొన్నారు. ఒక వైపు తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలించే విషయంలో పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేదన్నారు. సరిపడ గోనె సంచులు అందుబాటులో లేవని, చిరిగిన గోనె సంచులు అందిస్తున్నారని వాపోయారు. వాహనాలు ఏర్పాట్లలో తీవ్ర జాప్యం జరుగుతోందని, కొన్ని చోట్ల ధాన్యం తడిసిపోవడం వల్ల మరలా ఆరబెట్టుకునేందుకు సమయం పడుతుందన్నారు. దీని వల్ల ఖర్చులు పెరిగి నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేసారన్నారు. 25 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు ఇంకా రైతుల వద్దకు చేరలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించిన కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని రైస్ మిల్లులకు తక్షణమే తరలించి రైతులను ఆదుకోవాలని వారు డిమండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రైతులు సీహెచ్ రాజు, ఏ.శ్రీను, గంటా రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వాలి

ఉంగుటూరు: ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్ కమిషనర్ కృష్ణ తేజను కోరినట్టు ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి తెలిపారు. పలు సమస్యలను వివరించేందుకు ఎంపీపీలందరూ కృష్ణ తేజను శనివారం అమరావతిలో కలిసినట్టు గంటా శ్రీలక్ష్మి తెలిపారు. మండల పరిషత్తుకు ఇప్పుడున్న నిధుల మంజూరు అథారిటీని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని కోరినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి వివరించారు.

పాఠశాలలో శుభతిథి భోజనం

ఉంగుటూరు: ఉప్పాకపాడులో పీఎం పోషణ పథకం, మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా శుభతిథి భోజనం కార్యక్రమం శనివారం నిర్వహించారు. నాల్గవ తరగతి విద్యార్థిని మెండ్యాల యామిని తల్లితండ్రులు నరసింహస్వామి, దుర్గాభవాని సహకారంతో విద్యార్థులకు భోజనంతోపాటు స్పెషల్ స్వీటు ఏర్పాటు చేశారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని నిరుద్యోగ యువతకు డేటా ఎంట్రీ అంశంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు స్థానిక డీఎల్‌టీసీ సహాయ సంచాలకులు ఎస్ ఉగాది రవి ఒక ప్రకటనలో తెలిపారు. షార్ట్ టర్మ్ కోర్స్‌గా అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. పదో తరగతి, ఆపైన ఉత్తీర్ణులైన వారు 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు డిసెంబర్ 7వ తేదీ లోగా ఫోన్ నెంబర్లు 94934 82414లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పంచాయతన క్షేత్రంలో విశేష లింగార్చన



శివుని విగ్రహానికి హారతులు ఇస్తున్న మహంతులు



ప్రత్యేక అలంకరణలో ఉమానీలకంఠేశ్వరస్వామి



మండలపర్రులో శివలింగానికి బిల్వపత్ర అర్చనలో పాల్గొన్న భక్తులు

నిడమర్రు: మండలపర్రు ఉమానీలకంఠేశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో కార్తీక మాసం ముగింపు సందర్భంగా శనివారం రాత్రి వరకూ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా నీలకంఠేశ్వరునికి లక్షబిల్వార్చన, పండ్ల రసాలు, పూలలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం అమావస్య కావడంతో శనివారం కార్తీకమాసం ముగింపు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాలనుంచి అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని భారీ శివుని విగ్రహానికి కాశీ నుంచి వచ్చిన మహంతులతో 30 నిమిషాలపాటు ప్రత్యేక హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. సోమవారం తెల్లవారు జామున పోలి స్వర్గానికి పంపే పూజలు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

గ్రామాల్లో వ్యవసాయాధికారుల పర్యటన



అమ్మపాలెంలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌బాషా

పెదవేగి : గ్రామాల్లో పర్యటించిన వ్యవసాయాధికారులు తుఫాన్ ప్రభావంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల, అమ్మపాలెం గ్రామాల్లో జిల్లా వ్యవసాధికారి హబీబ్‌బాషా పర్యటించి ప్రస్తుతం ఫెంగల్ తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాల వల్ల ఇబ్బంది పడుతున్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. రానున్న 2 రోజులు వరి పంట కోతలు ఆపాల్సిందిగా రైతులను కోరారు. ఇప్పటికే కోసిన ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలని, అవసరమైన వారికి టార్పాలిన్స్ సరఫరా చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో పెదవేగి మండలం వ్యవసాయాధికారి ప్రియాంక, వీఏఏలు ధనరాజ్, శ్రీకాంత్ రైతులు పాల్గొన్నారు.

వర్షం... ఉలిక్కిపడిన రైతులు

భీమడోలు: అల్పపీడన ప్రభావంతో శనివారం కురిసిన వర్షానికి రైతులు ఉలిక్కిపడ్డారు. ఉదయం నుంచి ఆకాశం మేఘావృత్తమై వర్షం కురుస్తున్నందున ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతి కందే దశలో వాటిని కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. వర్షం వల్ల ధాన్యం తడిసిస్తే తేమ శాతం పెరిగి కొనుగోలు చేసేవారే ఉండరని రైతులు వాపోతున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో 29, 29, 30వ తేదీల్లో వరి కోతలు కోయవద్దని రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు రైతులకు సమాచారం అందించారు. అయితే రెండురోజులపాటు వర్షాలు రాకపోవడంతో రైతులు వరి కోతలు, మాసూళ్లను ప్రారంభించారు. శనివారం వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందారు. ఇప్పటికే ఎకరానికి రూ.30వేలకు పైగా పెట్టుబడులు పెట్టి సాగు చేసిన రైతు, కౌలు రైతులను ఈ వర్షాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. మండల వ్యాప్తంగా 12,873 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేయగా ఇప్పటివరకు 10వేల ఎకరాల్లో ధాన్యం మాసూళ్లు పూర్తయ్యాయి. ఇప్పటికే 13వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు చేరింది. ఇంకా 11వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు చేరాల్సిఉంది. ఇంకా కోతకోయని పంట 2,800 ఎకరాలు ఉండగా వరి కోత యంత్రాల ద్వారా కోసిన ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉన్నందున వాటిని రైతులు ఆరబోసారు. మిల్లులకు చేరని ధాన్యం ప్రధాన రహదారులు, ఇతర రోడ్లపై ఉంది. ఈ వర్షం వల్ల ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. తేమశాతంఉన్న ధాన్యాన్ని బస్తాల్లో నింపి తడిసిపోకుండా భద్రపర్చుకున్నారు. కొంతమంది రైతులు ధాన్యం బస్తాలను తమ ట్రాక్టర్లలో ఉంచి వాటిపై టార్పాలిన్లు కప్పి రక్షించుకుంటున్నారు. వరుణుడు కరుణించాలని రైతులు కోరుకుంటున్నారు. మరో రెండు రోజులు వరి కోతలు ప్రారంభించవద్దని అధికారులు సూచిస్తున్నారు.